

సమర యోధుడు

నారాయణస్వామి



శిలాఫలకంలో నారాయణస్వామి రెడ్డి పేరు

నారాయణస్వామిరెడ్డి (ఫైల్‌ఫొటో)

గంగాధరనెల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భరతమాత స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించినవారిలో గంగాధరనెల్లూరు మండలం వీరకనెల్లూరు గ్రామానికి చెందిన నారాయణస్వామిరెడ్డి ఒకరు.1942వ సంవత్సరంలో అప్పటి పరిపాలకులైన ఆంగ్లేయులు ఆరునెలల పాటు నారాయణస్వామిరెడ్డిని జైల్లో పెట్టడమే కాకుండా, ఆయనకు రూ.250 అపరాధం రుసుము విధించారు.జైలు నుంచి విడుదలయ్యాక నారాయణస్వామిరెడ్డి గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.స్వాతంత్ర్యం వచ్చాక రెండు దఫాలు చిత్తూరు బోర్డు మెంబరుగా పని చేసిన ఆయన 1959లో మృతి చెందారు. ప్రస్తుత గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పెనుమూరు మండలాలు కలిపి ఒకప్పుడు గంగాధరనెల్లూరు సమితిగా వుండేది.అప్పట్లో స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన ఈ ప్రాంత యోధుల గురించి భావితరాల ప్రజలు తెలుసుకునేందుకు గంగాధరనెల్లూరు సమితి కార్యాలయ(ప్రస్తుత ఎంపీడీవో ఆఫీస్) ఆవరణంలోకి వెళ్ళేటప్పుడు ఎడమవైపు గ్రానైట్ శిలాఫలకంలో నలుగురి పేర్లను తెలుగులో చెక్కారు.వీరిలో నారాయణస్వామిరెడ్డి పేరే మొదటిది కావడం విశేషం. గత ఏడాది ఆగస్టు 15వతేదీన నారాయణస్వామిరెడ్డి కుమారుడు, వెటర్నరీ డాక్టర్ విశ్వనాధరెడ్డి ఇంటికి వెళ్ళి ఎమ్మెల్యే థామస్ సన్మానం చేశారు.



ఇటీవల తిరుపతికి వచ్చిన కసిరెడ్డి కుటుంబసభ్యులు ఎస్వీయూలోని ఆయన విగ్రహం ముందు తీసుకున్న ఫొటో

కసిరెడ్డి ఖలేజా

ఇండో-పాక్ యుద్ధంలో అసువులు బాసిన ఎస్వీయూ పూర్వ విద్యార్థి

తిరుపతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి):తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆవరణంలో ఖాకీ దుస్తులు, తిరిగిన మీసాలు, చక్కని ముక్కు, ముఖవర్చస్సుతో ఒక చిన్న విగ్రహం (హాఫ్ బాడీ) కనిపిస్తుంటుంది. యూనివర్సిటీలో ఇలాంటి విగ్రహం ఎందుకు ఉందా? అని కొందరికి సందేహం కలగవచ్చు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఎస్వీయూ పూర్వ విద్యార్థి కసిరెడ్డి బలరాం రెడ్డి సేవలకు గుర్తుగా ఏర్పాటు చేసిన విగ్రహం అది. 1965వ సంవత్సరంలో జరిగిన ఇండో-పాక్ యుద్ధంలో ఓ బెటాలియన్‌కు ఫార్వర్డ్ ఆఫీసర్‌గా ముందుండి నిలిచిన కసిరెడ్డి బలరామ్ రెడ్డి వీరమరణం పొందారు. ఎస్వీయూ విద్యార్థిగా ఆయన వ్యక్తిత్వం, కుటుంబ నేపథ్యం, చనిపోయిన అనంతరం ప్రముఖుల సంతాప సందేశాలను ఎస్వీయూ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డాక్టర్ కె.నీలకంఠం రాసిన జ్ఞాపకాల ఆధారంగా...

● ఇదీ కసిరెడ్డి నేపథ్యం

కసిరెడ్డి నరసా రెడ్డి, సుబ్బమ్మ దంపతులకు 1938 డిసెంబరు 2న కడప జిల్లా రాజంపేట సమీపంలోని కొండపల్లిలో జన్మించారు.కసిరెడ్డి వంశీయులకు స్థానికంగా మంచి గుర్తింపు ఉంది.రాజంపేట, మదనపల్లెల్లో ప్రాథమికోన్నత విద్యను పూర్తిచేసి, తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చేరారు.అనంతరం ఎస్వీ యూనివర్సిటీలో పీజీ (ఎకనామిక్స్)లో చేరారు. సైన్యంలో చేరి దేశానికి సేవచేయాలని నిర్ణయించుకుని 1963లో పీజీ విద్యను మధ్యలోనే వదిలిపెట్టి ఆర్మీలో చేరారు. విద్యార్థి దశలో అన్నిరకాల క్రీడల్లో బాగా రాణించేవారు.ఎన్‌సీసీ సభ్యుడిగా నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్నారు. త్యాగశీల స్వభావం, చక్కని శరీరదారుఢ్యంతో కలుపుగోలుతనం కలిగిన వ్యక్తి.

● 27 ఏళ్లకే కన్నుమూత

బలరాముడికి బాల్యం నుంచే వైమానిక దళం లేదా సైన్యంలో ఉన్నతస్థాయి అధికారి కావాలనే గొప్ప ఆశయం ఉండేది.ఆర్మీలో కమిషన్డ్ అధికారిగా చేరిన అనతి కాలంలోనే అతని ధైర్యసాహసాలను ఉన్నతాధికారులు పసిగట్టారు. డియోలాలి కంటోన్మెంట్ లెఫ్టినెంట్‌గా 1964 జనవరిలో బాధ్యతలు స్వీకరించారు.ఆర్మీలోని సురక్షితమైన సరఫరా విభాగంలో చేరితే భద్రత ఉంటుందని కుటుంబ సభ్యులు, మిత్రులు చెప్పినా వినిపించుకోలేదు. యుద్ధ రంగంలో ఉండాలనే ఉద్దేశంతోనే సాహసోపేతమైన నిర్ణయాన్ని ఎంచుకున్నారు.1965 సెప్టెంబరు 22న ఇన్‌ఫాంట్రీ బెటాలియన్‌తో ఫార్వర్డ్ అబ్జర్వేషన్ ఆఫీసర్‌గా వెళ్లారు. అప్పుడు జరిగిన భారత్-పాక్ యుద్ధంలో షెల్ స్ప్లింటర్ తగిలి అక్కడే వీరమరణం పొందారు.కేబీ రెడ్డి చిన్నవయస్సులో చనిపోవడం బాధాకరమని, అయితే దేశంకోసం త్యాగం చేయడం గొప్ప విషయమని అప్పటి ప్రముఖులు వారి సంతాప సందేశాల ద్వారా నివాళులర్పించారు.

గణతంత్ర దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

● ముస్తాబైన పోలీసు పరేడ్ మైదానం ● 297మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాల ప్రదానం



రిపబ్లిక్ దినోత్సవానికి సిద్ధమైన వేదిక

చిత్తూరు సెంట్రల్/అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవాలకు చిత్తూరు పోలీసు పరేడ్ మైదానం అందంగా ముస్తాబైంది.మైదానాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు.కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు, ప్రముఖులు, అధికారులు, అవార్డు గ్రహీతలు, ప్రజల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి.ఏఎస్పీ రాజశేఖరరాజు శనివారం ట్రయల్ రన్ నిర్వహించారు.ఆదివారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ సుమిత్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. 9.10 గంటలకు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించాక ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. 9.50 గంటలకు జిల్లా ప్రగతి శకటాల ప్రదర్శన వుంటుంది. 10.10 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నడుస్తాయి. 10.40 గంటలకు ఉత్తమ సేవలందించిన 297మంది అధికారులకు,సిబ్బందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేస్తారు.పెరేడ్ మైదానంలో 10 శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించి లబ్ధిదారులకు ఆస్తులు పంపిణీ చేస్తారు. 11.55 గంటలకు జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగియనుంది.



మైదానంలో వేస్తున్న రంగవల్లులు



పోలీసుల గౌరవ వందనం ట్రయల్ రన్‌లో ఏఎస్పీ

ఢిల్లీలో గణతంత్ర దిన వేడుకలకు పుల్లూరు సర్పంచ్‌కు ఆహ్వానం



భవ్యశ్రీ

శ్రీరంగరాజపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగుతున్న గణతంత్రదిన వేడుకలకు రావాలని ఎస్‌ఆర్‌పురం మండలం పుల్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ గంగినేని భవ్యశ్రీకి ఆహ్వానం వచ్చింది. స్వచ్ఛ భారత్, విలేజ్‌వాటర్, శానిటేషన్, ఈడబ్ల్యూఎస్, జల్‌జీవన్ మిషన్ వంటి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు పరుస్తున్నందున ఆమెను ఆహ్వానించారు. ఇది తనకెంతో గర్వకారణమని సర్పంచ్ వివరించారు.

● కసరత్తు చేస్తున్న మైన్స్ అధికారులు

ఏడీఆర్ కట్టకుంటే

లైసెన్సుల రద్దు



జిల్లా గనులు, భూగర్భ శాఖ కార్యాలయం

చిత్తూరు సెంట్రల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్‌డ్ రెంట్ (ఏడీఆర్) కట్టకుంటే లైసెన్స్‌ల రద్దుకు జిల్లా మైన్స్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 423 బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్, రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్, గ్రావెల్, క్వార్ట్జ్ ఉండగా.. ప్రస్తుతం 217 మాత్రమే పనిచేస్తున్నాయి. ఇందులో బ్లాక్ గ్రానైట్ క్వారీలు 159, కలర్ గ్రానైట్ క్వారీలు 152, రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోర్ 102, గ్రావెల్స్ 8, క్వార్ట్జ్ రెండు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వీటిద్వారా రూ.134కోట్ల ఆదాయ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు రూ.87.45 కోట్లు వసూలు కాగా, లక్ష్యాన్ని చేరుకోడానికి మిగిలిన మొత్తం రెండు నెలల్లో వసూలు చేయాల్సి ఉంది. దీనిపై మైన్స్ అధికారులు దృష్టి సారించారు. ఇప్పటి వరకు ఏడీఆర్‌లు కట్టనివారికి ఫిబ్రవరి మొదటి వారంలో నోటీసులు ఇవ్వనున్నారు. ఫిబ్రవరి నెలాఖరులోపు ఏడీఆర్ కట్టకుంటే హెక్టారుపై మైన్స్ అధికారులు విధించే అపరాధ రుసుంతో మార్చి 15వ తేదీలోపు చెల్లించాలి. నిర్ణీత గడువులోపు చెల్లించకుంటే ఏప్రిల్ ఒకటినాటికి మైన్స్ లైసెన్స్‌లు రద్దు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లా కేంద్రంగా డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) కింద సుమారు రూ.62 కోట్ల వరకు గత ఏడాది జూన్ నెలలోనే వసూలైనా వాటిని లెక్కల్లో సర్దుబాటు చేయక పోవడం, సీనరైజ్ వసూలు కాంట్రాక్టును రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. వీటిద్వారా ప్రభుత్వానికి నెలవారీగా చెల్లించిన మొత్తం సర్దుబాటు చేయకపోవడంతో జిల్లా మైన్స్‌కు ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక లక్ష్యం తక్కువగా నమోదైనట్లు మైన్స్ అధికారులు చెబుతున్నారు.

సర్దుబాటు చేశాక ప్రభుత్వానికి నివేదిక



ఇప్పటివరకు ఏడీఆర్ చెల్లించని వారికి ఫిబ్రవరి మొదటి వారంలో నోటీసులు ఇవ్వనున్నాం. జిల్లా వార్షిక ఆదాయం సమకూర్పులో భాగంగా రూ.134 కోట్లకుగాను ఇప్పటి డిసెంబరు నెలాఖరు వరకు రూ.87.45 కోట్లు వసూలు చేశాం. గత ఏడాది జూన్ నెల వరకు వసూలైన సుమారు రూ.62 కోట్ల నుంచి రూ.65 కోట్ల మొత్తాన్ని చిత్తూరుతోపాటు పలమనేరు, మదనపల్లె, తిరుపతి మైన్స్ కార్యాలయాల ఖాతాలకు సర్దుబాటు చేసి, పూర్తి ఆర్థిక నివేదిక ప్రభుత్వానికి పంపుతాం.

- సత్యనారాయణ, మైన్స్ డిప్యూటీ డైరెక్టర్

బెస్ట్ ఎలక్టోరల్ అవార్డుల ప్రదానం

చిత్తూరు అర్బన్/సెంట్రల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి జిల్లాలోని పలువురు అధికారులకు రాష్ట్ర స్థాయి అవార్డులు ప్రదానం చేశారు. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ పలువురికి అవార్డులు అందజేశారు. వీరిలో.. ఎస్పీ మణికంఠతోపాటు కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం టెక్నికల్ అసిస్టెంట్ ఎస్.ఉమాపతి, నగరి నియోజకవర్గం సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రవికుమార్, నగరి 134 బూత్ బూత్ లెవల్ అధికారి ఎం.ఎస్.త్యాగరాజన్, 138వ బూత్ బూత్ లెవల్ అధికారి సుభాషిణి ఉన్నారు.





అవార్డు అందుకుంటున్న ఎస్పీ మణికంఠ - టెక్నికల్ అసిస్టెంట్ ఉమాపతి



సర్కారు స్పందనేంటో?

● చిత్తూరు పూర్వ కమిషనర్ అరుణపై ఆర్డీ నేతృత్వంలో విచారణ పూర్తి

చిత్తూరు అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):వైసీపీ పాలనలో చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పని చేసిన అరుణ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్న విషయం చర్చనీయాంశమైంది. అరుణపై వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో ఎనిమిదిమంది అధికారుల బృందం ఈ నెల 8వ తేది నుంచి విచారణ చేపట్టింది.సెలవులు పోనూ మొత్తం పది రోజుల పాటు పలు రికార్డులు, బిల్లులు పరిశీలించడంతో పాటు పలువురు సిబ్బందిని విచారించింది.సిబ్బంది సహకారంతో దొంగబిల్లులు పెట్టి ప్రభుత్వ ధనాన్ని లూటీ చేసినట్లు గుర్తించారు. విచారణ నివేదికల ఆధారంగా ఆమెతో పాటు సంబంధిత అధికారులపై చర్యలకు ఉపక్రమించనున్నారు. పది రోజుల పాటు సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని, పరిశీలించిన తరువాత ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకుంటుందని ఆర్డీ విశ్వనాథ్ తెలిపారు.

● వైసీపీ నేతలకు నామినేషన్‌పై పనులు

వైసీపీ శ్రేణులకు లాభం చేకూర్చేందుకు ఇంజనీరింగ్ పనుల్లో ప్రాధాన్యత కల్పించినట్లు విచారణ బృందం గుర్తించింది. ముఖ్యంగా రూ.లక్షకు పైబడి ఖర్చయ్యే పనులకు టెండర్లు పిలవాల్సి ఉండగా ... రూ. 98వేలు, రూ. 99 వేలకు పనులను విభజించి తనకు అనుకూలమైన వైసీపీ నేతలకు, సానుభూతిపరులకు నామినేషన్‌పై పనులను అప్పగించి వారి నుంచి పెద్దఎత్తున కమీషన్లు తీసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపింది.● వైసీపీ హయాంలో నిర్వహించిన జగనన్న వైద్య శిబిరాలకు లక్షలాది రూపాయలు ఖర్చుచేసినట్లు పెట్టిన బిల్లుల్లో భారీ అవినీతి జరిగినట్లు గుర్తించారు. ● పారిశుధ్య పనులకు అవసరమైన బ్లీచింగ్,చెత్త బుట్టలు, గ్లౌజులు, ఫాగింగ్ యంత్రాల కొనుగోలులో అవినీతిఅక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ బృందం పలు రికార్డులను స్వాధీనం చేసుకుని సమాచారం సేకరించింది. ● వాహనాల మరమ్మతుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసినట్లు బిల్లులుండగా .... ఆ వాహనాల కండీషన్‌ను విచారణ బృంద సభ్యులు పరిశీలించారు. ● నగరపాలక సంస్థలో 35 వాహనాలకు పెట్రోల్, డీజల్ వినియోగంలో రూ. 62 లక్షల మేరకు నకిలీ బిల్లులున్నట్లు ఫిర్యాదులు రాగా... ఆ వాహనాలు ఎన్ని కిలోమీటర్లు తిరిగాయనే వివరాలను నమోదు చేశారు. ● పట్టణ ప్రణాళికా విభాగం నగరంలో నిర్మాణాలకు ఇచ్చిన అనుమతులపై విచారణ బృందం క్షేత్రస్థాయిలో విచారణ జరిపింది.

● చుడా, డీటీసీపీ పరిధిలోకి వచ్చినా...

పట్టణ ప్రణాళిక విభాగంలోనూ కమిషనర్ అరుణ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని విచారణ బృందం నిర్ధారణకు వచ్చింది. వెయ్యి చదరపు మీటర్లు ప్లాట్ ఏరియా, 15 మీటర్ల ఎత్తయిన భవనాలకు అనుమతి ఇచ్చే అధికారం మాత్రమే కమిషనర్‌కు ఉంది. అంతకు మించితే చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ(చుడా), 4వేల చదరపు మీటర్ల విస్తీర్ణం దాటితే డైరెక్టర్ అండ్ కంట్రీప్లానింగ్ (డీటీసీపీ)కు దరఖాస్తులు పంపాలి. అయితే ఆమె వీటన్నింటిని కాలదన్ని తమకు అనుకూలమైన వారికి కార్పొరేషన్‌లోనే అనుమతులు ఇచ్చేశారు.

అమూల్ డెయిరీకి రోడ్డు వేయించి....

చిత్తూరు నగరంలోని విజయ డెయిరీ ఆస్తులను 99 ఏళ్ల పాటు సీఎం హోదాలో జగన్ అమూల్ డెయిరీకి ధారాదత్తం చేశారు. 2023 జూలై 4న ఆయన జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా జగన్ వెళ్లేందుకు అనువుగా ప్రధాన రోడ్డు నుంచి జగన్ పాల్గొనే కార్యక్రమం వరకు నగరపాలక సంస్థ నిధులతో తారు రోడ్డు వేయించారు.ఈ పనులన్నీ అమూల్ సంస్థ చేయించాల్సి ఉండగా... మంత్రి పెద్దిరెడ్డి మెప్పుకోసం నగరపాలక సంస్థ డబ్బులను మంచినీళ్లలా ఖర్చు చేశారు.అదేవిధంగా నగరపాలక సంస్థ సిబ్బంది 300మందితో పదిరోజుల పాటు విజయ డెయిరీలో శుభ్రం చేయించే పనులు చేయించారు.

ఎం.కొత్తూరు పాఠశాలలో

ఉన్నతాధికారుల విచారణ

నగరి,జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం ఎం.కొత్తూరు ఉన్నత పాఠశాలలో తలెత్తిన వివాదంపై శనివారం ఆర్డీవో భవానీశంకరి సమక్షంలో విచారణ జరిగింది. పాఠశాల సమీపంలోని మాంగాడు దళితవాడకు చెందిన కొంతమంది పిల్లలు తమ ఊరి పిల్లలను ఇళ్లవద్దకు వచ్చి మరీ కొడుతున్నారని....కాబట్టి తమ ఊరిలో అసలు స్కూలే వద్దని ఎం.కొత్తూరువాసులు శుక్రవారం పాఠశాలను మూసివేసి నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో స్త్రీ, శిశుసంక్షేమ పీడీ వెంకటేశ్వరి , డీవైఈవో ప్రభాకరరాజు, ఎంఈవోలు శ్రీదేవి, నమఃశ్శివాయ, ఎక్సైజ్‌డీఎస్పీ కృష్ణకిశోర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి ,సీఐ మహేశ్వర్,సీడీపీవో కృష్ణవేణిలతో కూడిన కమిటీ ఆర్డీవో నేతృత్వంలో శనివారం పాఠశాల వద్దకు చేరుకుంది. కొత్తూరు గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఉన్నతాధికారులు మాట్లాడి ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు.వారి వద్ద స్టేట్‌మెంట్లు నమోదు చేశారు.కొందరు విద్యార్థుల దురుసు ప్రవర్తన కారణంగా జరిగిన సంఘటనలపై అధికారులు దృష్టిసారించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆర్డీవో మాట్లాడుతూ రెండు రోజులుగా జరిగిన సంఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని తెలిపారు.ప్రవర్తనాలోపం వున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించడం జరుగుతుందని, భవిష్యత్తులో ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా పాఠశాలలో తరగతులు జరిగేలా చూసే బాధ్యత తనదన్నారు.పాఠశాలలో ఏ సంఘటన జరిగినా ప్రధానోపాధ్యాయులే చూసుకోవాలని సూచించారు.కొత్తూరు గ్రామంలోకి వెళ్లి దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.పాఠశాలలో చేపట్టిన విచారణాంశాలను పూర్తిగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.



కొత్తూరు గ్రామస్తులతో చర్చిస్తున్న ఆర్డీవో భవానీశంకరి



ప్రభాకర్

మెరిటోరియస్ అవార్డుకు అధికారుల ఎంపిక

చిత్తూరు సెంట్రల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులు రాష్ట్ర మెరిటోరియస్ అవార్డుకు ఎంపికయ్యారు. పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ఎం.ప్రభాకర్, చిత్తూరు డివిజనల్ డీడీ డాక్టర్ ఎండీ అబ్దుల్ ఆరీఫ్‌లు ఆదివారం విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డులు అందుకోనున్నారు.



అబ్దుల్ ఆరీఫ్

రూ.3.5 కోట్లతో విద్యుత్ ఉపకేంద్రం


భూమిపూజలో పాల్గొన్న అధికారులు, నాయకులు

రామకుప్పం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంద్యాలమడుగు, గొరివిమాకులపల్లె, బందార్లపల్లె పంచాయతీల్లో మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం రూ.3.5 కోట్ల వ్యయంతో కృష్ణానగర్‌లో విద్యుత్ ఉప కేంద్రం నిర్మిస్తోందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్ అన్నారు. శనివారం మండలంలోని బందార్లపల్లె పంచాయతీ కృష్ణానగర్‌కాలనీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి అధికారులు, టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, డీఈలు శ్రీనివాసమూర్తి, అమర్‌బాబు, ఏఈ రామిరెడ్డి, కన్‌స్ట్రక్టర్ ఏఈ రెడ్డికుమార్, రెస్కో ఎండీ సోమశేఖర్, డీఈ హిమ్మద్‌సాగర్, ఏడీఏ సుధాకర్, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, జనసేన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరీష్, భాస్కర్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

●వి.కోట: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా విరివిగా సబ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఈఈలు అమర్‌బాబు, శ్రీనివాసమూర్తి అన్నారు. శనివారం వి.కోట మండలం అన్నవరం, లింగాపురం గ్రామాల వద్ద సబ్ స్టేషన్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, రెస్కో ఎండీ షణ్ముగం, డీఈలు రెడ్డికుమార్, సాగర్, ఏడీఈలు సుధాకర్, ఏఈ ఇస్మాయిల్ అహమ్మద్, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు


మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈవోలు

కల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే వంట నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య హెచ్చరించారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఎంఈవోలు తనిఖీ చేశారు. అత్యవసర సమావేశం నిర్వహించి మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులు సామాజిక తనిఖీ బృందం దృష్టికి తీసుకెళ్లారని.. వెంటనే డీఈవోకు నివేదిక పంపాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి

పుంగనూరు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సంఘమిత్రల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో మహిళలదే కీలకపాత్ర అని పేర్కొన్నారు. సమావేశంలో కూటమి నాయకులు విరూపాక్షి, కవిత, గంగాధర్, వెంకటరెడ్డి, రమణ, చైతన్య రాయల్, మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, మణి, హరినాయక్, బాలాజీనాయక్, శ్రీనివాసులు, శంకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సామాజిక సౌభ్రాతృత్వం


గెలుపొందిన విద్యార్థులతో బీసీ నాగరాజ్ తదితరులు

కుప్పం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ప్రాంతాలు, జాతులు, దేశాల మధ్య సామాజిక సౌభ్రాతృత్వం సాధ్యపడుతుందని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజ్ అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న వార్షిక క్రీడోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొని మానసిక, శారీక దృఢత్వం సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం ఫుట్‌బాల్, క్రికెట్, బాస్కెట్ బాల్, టెన్నిస్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, కబడ్డీ, రన్నింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, అధ్యాపకులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్ రాజ్, సీఈవో ఎన్.సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, పీడీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గోకులాలు రైతులకు వరం


నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏపీడీ శ్రీనివాసులు

సోమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు గోకులం షెడ్ నిర్మాణాలపై ఉత్సాహంగా ఉన్నారని ఏపీడీ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సోమల మండలంలోని పలు పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్‌ను ఆయన పరిశీలించారు. పాడి రైతులకు పలు సూచనలు చేశారు. సోమల, అడుసుపల్లె, నెల్లిమందల్లో పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో దినకర్‌బాబు, టీడీపీ నాయకులు శివశంకర్, చాణక్య, మేకల గంగాధరం, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలి

- పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి


అధికారులతో సమీక్షిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు అధికారుల సహకారం ఉండాలని పుంగనూరు నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అధికారులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమీక్షించారు. పంచాయతీ వారీగా అభివృద్ధి పనులు, సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గానుగచింత పంచాయతీలో తాగునీటి బోర్లకు కనెక్షన్ లేవని, నీరు పుష్కలంగా ఉన్నా.. జగడంవారిపల్లెలో ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన బోరుకు ప్రైవేటు వ్యక్తులు తాళాలు వేశారని, వంకమద్దివారిపల్లె, లోకావారిపల్లె, గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో మధుసూదనరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, సర్పంచి రాయచోటి ఇబ్రహీంఖాన్, ఈవోపీఆర్డీ సత్యంరెడ్డి, ఎంఈవో ఇందిర, ఏవో సుధారాణి, ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం వ్యవసాయాధికారిగా ఫయాజ్ బాషా


ఫయాజ్ బాషా

కుప్పం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల వ్యవసాయాధికారిగా ఆర్ఎస్.ఫయాజ్ బాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వ్యవసాయాధికారిగా ఉన్న అమృతవల్లి రైతు సాధికార సమితి ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఫయాజ్ బాషా మాట్లాడుతూ రైతులకు నిత్యం అందుబాటులో ఉండి వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు అమలు చేసేలా వారిని చైతన్య పరుస్తానని తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

కుప్పం రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం వెండుగంపల్లె సమీపంలో పున్నమి టూరిజం రెస్టారెంటు సమీపంలోని ఓ హోటల్ వద్ద అక్రమ మద్యం విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు కుప్పం అర్బన్ సీఐ పి.శంకరయ్య తెలిపారు. వెండుగంపల్లె గ్రామానికి చెందిన ఎం.మూర్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు పేర్కొన్నారు.

పశువులకు ఉచిత వైద్యసేవలు

సోమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లిగట్లలో పశువైద్యాధికారి డాక్టర్ చందనప్రియ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పాడిరైతులకు పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డిమోహన్, విశ్వనాధం, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, రవికుమార్, రామకృష్ణ, పశువైద్య సిబ్బంది మహేశ్, సురేశ్, సహదేవ, అనూష తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో పుంగనూరు విద్యార్థిని ప్రతిభ



పుంగనూరు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పుంగనూరు బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఉమ్మేమారియా ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్ఎం రుద్రాణి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థినికి ప్రశంసాపత్రం అందించి అభినందించారు.

బాల్య వివాహాలపై అవగాహన తప్పనిసరి



గంగవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత పిలుపునిచ్చారు. శనివారం గంగవరం హైస్కూల్‌లో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ప్రసాద్, ఎంఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శనివారం బైరెడ్డిపల్లె మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయడానికి ముఖ్యమంత్రి కార్యాచరణ రూపొందిస్తున్నారని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. త్వరలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, తల్లికి వందనం అమలు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇచ్చిన హామీలన్నిటినీ అంచెలంచెలుగా అమలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి.. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు చంద్రబాబునాయుడు, లోకేష్ దావోస్‌లో పర్యటిస్తుండటం శుభపరిణామమన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, గ్రామీణ రహదారుల అభివృద్ధి, బైరెడ్డిపల్లె మండలాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మండలంలోని 81 స్వయం సహాయక సంఘాలకు రూ.13.92 కోట్ల ఆర్థిక సాయం చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, జనసేన నాయకుడు పసుపులేటి దిలీప్, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, తహసీల్దార్ మాధవరాజు, వెలుగు డీపీఎంయూ హరికృష్ణారెడ్డి, ఏపీఎం సాయిలత తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

బైరెడ్డిపల్లె, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యలను పరిష్కరించి మండలాభివృద్ధికి కృషిచేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎఫ్ఎంబీ ప్రకారమే భూముల రీసర్వే జరగాలని, అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని, రైతులకు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లను అందించాలని, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలకు అనుగుణంగా ఆదర్శ పాఠశాలల ఏర్పాటు జరగాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, తహసీల్దార్ మాధవరాజు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు

- వైద్యాధికారిణి షమామరెహ్మాన్


సమావేశంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

కల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని.. ఆసుపత్రుల్లో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారిణి షమామరెహ్మాన్ అన్నారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పోలీసు బందోబస్తు మధ్య మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ చిన్నారులకు టీకాలు సకాలంలో వేస్తున్నామని.. ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి తబ్రీజ్ బాషా మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఈనెల 31 వరకు ఉచిత పశువైద్య శిబిరాలు జరుగుతాయని .. పాడి రైతులకు మొక్కజొన్న, జొన్న విత్తనాలను సబ్సిడీ ధరలతో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉద్యానశాఖ అధికారి సంతోషికుమారి మాట్లాడుతూ మామిడి రైతులకు 50 శాతం రాయితీతో కవర్లు అందజేస్తున్నామని.. మండలానికి 5 లక్షల కవర్లు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లతో సంప్రదించాలని కోరారు. మండల ఆర్ఐ దొరస్వామి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంఈవో పోకల తాతయ్య, ఏపీఎం చంద్రమోహన్, ఎంఈవో శిద్ధరామయ్య, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో పలమనేరు విద్యార్థి మొదటిస్థానం



జేసీ విద్యాధరి నుంచి బహుమతి అందుకుంటున్న చరణ్‌తేజ్

పలమనేరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పలమనేరు మండలం దొడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుకుంటున్న బి.చరణ్‌తేజ్ మొదటి బహుమతి సాధించాడు. చిత్తూరు కళాక్షేత్రంలో జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విద్యాధరి నుంచి బి.చరణ్‌తేజ్ జ్ఞాపికతోపాటు ప్రశంసాపత్రం అందుకున్నాడు. విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుందరం మొదటి స్థానంలో నిలిచిన బి. చరణ్‌తేజ్, శిక్షణ ఇచ్చిన పాఠశాల డ్రాయింగ్ టీచర్ వి.సుధాకర్‌ను , హెచ్ఎం కె.ఎన్.నేతాజిని అభినందించారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా


శ్మశానాన్ని తవ్వేశారని అధికారులకు విన్నవిస్తున్న గ్రామస్థులు

గంగవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రియల్టర్లు ప్రభుత్వ భూములు ఆక్రమించి శ్మశానానికి, చెరువుకు దారిలేకుండా చేశారని గంగవరం గ్రామస్థులు శనివారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గంగవరం సమీపంలోని సిగరాకు చెరువుకు, చెరువు పక్కనే ఉన్న శ్మశానానికి మదనపల్లె రోడ్డు నుంచి బండిబాట ఉండేదన్నారు. కొందరు రియల్టర్లు చెరువు పక్కన భూములు కొనుగోలు చేసి బండిబాట, రాజుకాలువను రాత్రికి రాత్రే పూడ్చివేశారని వాపోయారు. న్యాయం చేయాలని డిమాండు చేశారు. స్పందించిన రెవెన్యూ అధికారులు లేఅవుట్ వద్దకు చేరుకొని కొలతలు వేశారు. రాజుకాలువ పూడ్చేశారని అధికారుల విచారణలో తేలింది. అక్కడ చేపడుతున్న ప్రహరీ పనులను ఆపేశారు. న్యాయం చేస్తామని హామీఇవ్వడంతో ధర్నా విరమించారు.

టీడీపీ నేతలపై కేసు నమోదు

సోమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్త మునీర్ సాహెబ్‌పై దాడికి పాల్పడిన సంఘటనతో పలువురు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు చౌడేపల్లె సీఐ రాంభూపాల్ తెలిపారు. కందూరుకు చెందిన జనసేన కార్యకర్త మునీర్ సాహెబ్‌ను గురువారం రాత్రి టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమల మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, శ్రీనివాసులు, రమేశ్, బాల నాయుడు, సత్యం నాయుడు, దర్మనాయుడు, అర్జున్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పట్టపగలే ఆటో చోరీ

చౌడేపల్లె, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఆటో చోరీ జరిగిన సంఘటన చౌడేపల్లె మండలంలో శనివారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని చుక్కావారిపల్లెకు చెందిన మునిరత్నరెడ్డి ఆటో స్టాండులో మధ్యాహ్నం ఆటోను పార్కింగ్ చేసి బస్టాండుకు వచ్చారు. పుంగనూరు మండలం నక్కలదిన్నె తాండాకు చెందిన విజయ్‌కుమార్‌నాయక్ ఆటోను చోరీ చేసి పలమనేరు రోడ్డులోని ఆర్టీసీ బస్టాండులో వదిలి పెట్టాడు. బ్యాటరీని తొలగించి వ్యక్తి వద్ద తాకట్టు పెట్టి రూ.వెయ్యి తీసుకుని మద్యం సేవించాడు. మునిరత్నరెడ్డి తన ఆటో కనిపించక పోవడంతో మిత్రులతో కలిసి సమీపంలోని సీసీ కెమెరాలలో ఆటో చోరీ చేసిన వ్యక్తిని గుర్తించారు. వెతకగా బస్సులో కనిపించాడు. అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

వైసీపీ వ్యాఖ్యలు హాస్యాస్పదం

శాంతిపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ల దావోస్ పర్యటనపై వైసీపీ చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్ ఐదేళ్ల దోచుకోవడం, దాచుకోవడంపై శ్రద్ధ చూపారే తప్ప రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. అసలు వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంటే ఏంటో ఆ పార్టీ నేతలకు పూర్తిగా అవగాహన లేదన్నారు. మంత్రి రోజా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడులు

వి.కోట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మామిడిలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్ మధుసూదనరెడ్డి అన్నారు. శనివారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో వి.కోటలో మామిడి రైతులకు పూతకాలంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి పూత, మొగ్గదశలో ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



పలమనేరులో ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్డీవో భవాని



పుంగనూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

చౌడేపల్లె, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ హనుమంతు అన్నారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీతో వెళ్లి బస్టాండులో మానవహారం నిర్వహించారు. ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వరరావు, హెచ్ఎం నాగరాజరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● కల్లూరు: పులిచెర్ల మండల కేంద్రంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దారు జయసింహ ఆధ్వర్యంలో విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ దొరస్వామి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం నందగోపాల్‌రెడ్డి , నాయకులు మంజునాథగౌడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●పలమనేరు: అర్హులందరూ తప్పనిసరిగా ఓటుహక్కు కోసం నమోదు చేసుకోవాలని పలమనేరు ఆర్డీవో భవాని పిలుపునిచ్చారు. శనివారం పలమనేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులచే ర్యాలీ ప్రారంభించారు. తహసీల్దార్ ఇన్నునాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు తదితరులు పాల్గొన్నారు.

●దేశంలో రోజురోజుకు ప్రజాస్వామ్యం కనుమరుగవుతోందని స్వాతంత్ర్య సమరయోధులు, పలమనేరు మాజీ శాసనసభ్యులు టీసీ రాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పలమనేరు తహసీల్దార్ కార్యాలయంలో ఆయనతోపాటు బీజేపీ అధ్యక్షులు తాతయ్యనాయుడు(79), పార్వతమ్మ(82)లను తహసీల్దార్ ఇన్నునాథన్ శాలువతో సన్మానించారు.

●పుంగనూరు: యువత ఓటుహక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ రాము, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ లినార్డు పాఠశాల ఆవరణలో ఓటర్ల దినోత్సవం జరిగింది. పట్టణంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫణికుమార్, వీర్వోలు, టీడీపీ నాయకులు సీవీరెడ్డి, రామకృష్ణమరాజు, దేశాధి ప్రకాశ్, హెచ్ఎం ఉషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, గూడూరుపల్లె హైస్కూల్‌లో విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పిన్సిపాల్ రాజశేఖర్, హెచ్ఎం మహేశ్‌నారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● సోమల: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సోమల బస్టాండ్‌లో మండల స్థాయి అధికారులు మానవహారం నిర్వహించారు. తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో నారాయణ, ఎంఈవో శివరత్న, పీడీ కరుణానిధి, హెచ్ఎంలు హరినాథ్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●సదుం: ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కుగా భావించాలని సదుం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనాథరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తహసీల్దారు ఎస్ఎం హుస్సేన్ ఆధ్వర్యంలో బస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు.

● రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాసులు, డీటీ లోకేష్, ఆర్ఐ సుధాకరనాయక్, వీఆర్ఏ ల సంఘం జిల్లా నాయకులు ఇర్ఫాన్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

●గుడుపల్లె: అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తాహసీల్దారు సీతారామ్ పేర్కొన్నారు. గుడుపల్లెలో శనివారం ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో రాధాకృష్ణ, ఎంఈవో లక్ష్మయ్య, డీటీ కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ రామకృష్ణమనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●వి.కోట: వి.కోటలో ఓటరు దినోత్సవాన్ని తహసీల్దారు పార్వతి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఓటరు నమోదుపై పిల్లలకు అవగాహన కల్పించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై జయకృష్ణ, ఉపాధ్యాయులు, బీఎల్‌వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

●రామకుప్పం: రామకుప్పంలో తహసీల్దారు ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ బాలాజీ, ఆర్ఐ నారాయణప్ప, వీఆర్వోలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొలాలపై ఏనుగుల గుంపు దాడి

వరి, అరటి, మామిడి పంటల ధ్వంసం





మామిడి చెట్టును విరిచేసిన ఏనుగులు - ధ్వంసమైన వరి పంట

బంగారుపాళ్యం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలం బోడబండ్ల సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న పాతురుబండ వద్ద 14 ఏనుగుల గుంపు తిష్టవేసి ఉంది. ఈ ఏనుగు గుంపు సమీపంలోని బోడబండ్ల పంచాయతీలో శుక్రవారం రాత్రి పొలాలపై దాడి చేసి పంటలకు తీవ్ర నష్టం కల్గజేశాయి. బోడబండ్లకు చెందిన నరసింహులు మాట్లాడుతూ తమ పొలంలోని వరి, అరటి, పశుగ్రాసంతోపాటు కొబ్బరిచెట్టును విరిచేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. మురగయ్య మాట్లాడుతూ పది రోజులుగా ఏనుగులు వరి పంటపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని చెప్పారు. శాంతమ్మ మాట్లాడుతూ పదేళ్ల వయసున్న మామిడి చెట్లను పూర్తిగా విరిచేశాయమని వాపోయారు. అలాగే పాతపాళ్యంకు చెందిన విజయ్, మహదేవ, రామయ్యలకు చెందిన అరటి, వరి, మామిడి పంటలను ధ్వంసం చేశాయి.

రాత్రివేళల్లో గస్తీ కాస్తున్నాం: ఎఫ్ఎస్వో

పాతురుబండ సమీపంలోని దట్టమైన అడవీలో 14 ఏనుగుల తిష్ట వేశాయని ఎఫ్ఎస్వో మోహనమురళి తెలిపారు. రాత్రివేళలో సమీప పొలాలపై పడుతున్నాయని చెప్పారు. ఈ ఏనుగుల గుంపు ప్రతి ఏడాది జనవరిలో తమిళనాడు నుంచి ఈ ప్రాంతానికి వలస వస్తాయని, 20 రోజులపాటు ఇక్కడే ఉండి.. తర్వాత పెద్దఉప్పరపల్లె అటవీ ప్రాంతానికి వెళతాయన్నారు. పాతురుబండ సమీపంలో సిక్స్‌లేన్ పనులు జరుగుతుండడంతో అవి రోడ్డు దాటి వెళ్లలేకున్నాయని గుర్తించామని తెలిపారు. 15 మంది సిబ్బందితో రాత్రి వేళల్లో గస్తీ కాస్తూ.. ఏనుగులను మళ్లిస్తున్నామని, దీంతో పంట తీవ్రత తగ్గుతోందన్నారు. పంటనష్టాన్ని అంచనా వేసి పైఅధికారులకు నివేదిక ఇస్తున్నామని తెలియజేశారు.



పంట నష్టాన్ని అంచనా వేస్తున్న అటవీ అధికారులు

టెన్త్ టాపర్‌కు గవర్నర్‌తో భేటీ అవకాశం



విద్యార్థిని తన్మయి

భైరెడ్డిపల్లె, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాల పూర్వవిద్యార్థిని తన్మయి రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్ర గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో కలిసే అరుదైన అవకాశాన్ని పొందినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో 592 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన తన్మయి గవర్నర్‌తో 'అట్ హోమ్ ప్రోగ్రాం'కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తన్మయి తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. గవర్నర్‌తో కలవడానికి ప్రత్యేక ఆహ్వానాన్ని అందుకున్న తన్మయికి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.





అయ్యోరులేని బడిలో చిన్నారుల ఆటవిడుపు - తరగతి పాఠశాలలో ఖాళీగా ఉన్న అయ్యోరి కుర్చీ

అయ్యోరు లేని బడి!

కుప్పం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈ బడిలో చిన్నారులు ఎంత ఆరామ్‌గా ఆడుకుంటున్నారో. క్లాసులో బుద్ధిగా కూర్చున్నారు కానీ, వారికి చదువులు చెప్పే దిక్కు మాత్రం లేదు. కుప్పం మండలం టి.సదుమూరు పంచాయతీ సింగాపురం గ్రామానికి చెందిన వీరాస్వామి కొట్టాలులోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది. శనివారం మధ్యాహ్న భోజనం తర్వాత తీసిన చిత్రాలివి. అవును.. ఆ బడిలో పిల్లలున్నారు. అయ్యోరు మాత్రం లేరు. సంక్రాంతి సెలవుల తర్వాత అటువైపు ఎవరూ తిరిగి చూడలేదు. పిల్లలు లేరన్న కారణంతో ఇక్కడున్న మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను 2016లో మూసివేసి, పిల్లలను పక్కనే ఉన్న మరో స్కూలుకు పంపేశారు. కానీ రాజీయపరమైన ఒత్తిడితో 2024 ఆగస్టులో వీరాస్వామి కొట్టాలులోని ప్రాథమిక పాఠశాలను తిరిగి తెరిచారు. అప్పటినుంచీ ఇదే పరిస్థితి. మొత్తం 20 మంది విద్యార్థులున్న ఈ బడికి అయ్యోర్లు మొదటినుంచీ లేరు. పక్కనున్న ఇతర బడుల నుంచి అప్పుడప్పుడూ డిప్యుటేషన్ మీద టీచర్లను నియమిస్తున్నారు కానీ. వారెవరూ సక్రమంగా బడికి వచ్చి పాఠాలు చెబుతున్న పాపాన పోవడంలేదు.వీరితో పడలేని విద్యాశాఖాధికారులు, సీఆర్‌ఎంటీ (కమ్యూనిటీ రిసోర్స్ మొబలైజ్ టీచర్) బాలాజీని సంక్రాంతి సెలవులకు ముందు బడిలో పాఠాలు చెప్పడానికి నియమించారు. సంక్రాంతి సెలవుల తర్వాత ఆయన కూడా ఇటువైపు తిరిగి చూడలేదు. సంక్రాంతి సెలవులు ముగిసి ఈనెల 20వ తేదీన బడులు తిరిగి తెరిచారు. అప్పటినుంచీ కూడా బడికి పిల్లలు వస్తున్నారు కానీ, చదువులు చెప్పే దిక్కే లేకుండా పోయింది. ఇదేమని మండల విద్యాశాఖాధికారి మహబూబ్ బాషాను వివరణ కోరగా, అడవిబూదుగూరు హరిజన వాడ పాఠశాల టీచర్ రాజేంద్రకు డిప్యుటేషన్‌మీద వీరాస్వామి కొట్టాలు బడిలో విధులు కేటాయించామని చెప్పారు. అయితే అటు ఎస్ఆర్‌ఎంటీ కానీ, టీచర్ రాజేంద్ర కానీ సంక్రాంతి సెలవుల తర్వాత ఆరు రోజులుగా ఇటువైపు తిరిగి చూడలేదని పిల్లలు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. అంతే కాదు.. ప్రభుత్వ బడుల్లో పంపిణీ చేస్తున్న చిక్కీలు, రాగి జావ కూడా సక్రమంగా ఇవ్వడంలేదని ఆరోపిస్తున్నారు. ఇక స్పందించాల్సింది జిల్లా విద్యాశాఖాధికారులే.

రోజా వ్యాఖ్యలపై స్పందించడం సమయం వృథా

ఎమ్మెల్యే భానుప్రకాష్

తిరుపతి అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఏం మాట్లాడుతుందో కూడా తెలియకుండా మాట్లాడే రోజా వ్యాఖ్యలపై మాట్లాడటం సమయం వృథా అంటూ నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ ఎద్దేవా చేశారు. శనివారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ జగన్ లీడర్‌షిప్‌పై నమ్మకం లేకనే విజయసాయిరెడ్డి వైసీపీకి రాజీనామా చేశారని భావిస్తున్నామన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలని వైసీపీ ప్రయత్నం చేస్తోందన్నారు. అమరావతి, పోలవరం అభివృద్ధి చెందకూడదని ఆ పార్టీ నేతలు లెటర్లు పెడుతున్నారన్నారు. వైసీపీ పాలనలో ఏపీ అన్ని విషయాల్లో వైఫల్యం చెందిందని నీతి అయోగ్ వెల్లడించిందన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు తాపత్రయ పడుతున్నారని, పెట్టుబడులను ఆకర్షించడానికి దావోస్‌కు ముఖ్యమంత్రి బృందం వెళ్లిందని అన్నారు.

హైరోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



భవనాలను తొలగిస్తున్న సిబ్బంది

చిత్తూరు అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో హైరోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులకు దశలవారీగా టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ చేశారు. ఇండ్లు, దుకాణాలను కోల్పోతున్న బాధితులతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఇతర ప్రజాప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారులు చర్చలు కూడా జరిపారు. ఈ నేపథ్యంలో దేవదాయ శాఖకు సంబంధించిన పది దుకాణాలను తొలగించే పనులు శనివారం మొదలుపెట్టారు.

అడ్డుకోబోయిన ఈవో : ఓ దుకాణంపైకి ఎక్కి తొలగింపు పనులను ఎండోమెంట్ ఈవో సుబ్రహ్మణ్యం అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దాంతో కొద్ది నిమిషాలపాటు ఉద్రిక్తత నెలకొంది. అక్కడున్న అధికారులు, ప్రజాప్రతినిధులు కల్పించుకుని సుబ్రహ్మణ్యంను ఎమ్మెల్యే జగన్మోహన్‌తో ఫోన్లో మాట్లాడించారు. ఎండోమెంటు దుకాణాలకు ప్రత్నామ్నాయ మార్గాలు చూపిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఈవో వెళ్లిపోయారు. అనంతరం పది దుకాణాల తొలగింపు పనులను చేపట్టారు.

కూటమి ప్రభుత్వంతోనే రాజ్యాంగ పరిరక్షణ

జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్

చిత్తూరు సెంట్రల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాజ్యాంగ పరిరక్షణకు మేలు జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఎన్నో సంక్షేమ పథకాలు అందజేస్తూ స్వర్ణాంధ్ర విజన్ 2047 దిశగా దూసుకుపోతున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

ఐసీటీసీ వాహనం రాక

● హెచ్ఐవీ టెస్టుల నిర్వహణకు కేటాయించిన ప్రభుత్వం



ఐసీటీసీ వాహనంతో డాక్టర్ వెంకటప్రసాద్

చిత్తూరు రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్, టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ) వాహనాన్ని ప్రభుత్వం కేటాయించింది. శనివారం జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన అధికారి వెంకటప్రసాద్‌కు ఈ వాహనాన్ని అప్పగించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ వాహనం మారుమూల గ్రామాలకు వెళ్లి హెచ్ఐవీ టెస్టులు నిర్వహిస్తుంది. పాజిటివ్ వచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచి.. ఏఆర్‌టీ కేంద్రాలకు అందజేస్తారు. ఈ వాహనం ద్వారా రోజుకు 200 మందికిపైగా పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఉందని తెలిపారు.

వాహనం తొక్కేయడంతో కొండ చిలువ మృతి



తవణంపల్లె, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలంలోని షికారీ కాలనీ సమీపంలో శనివారం ఉదయం సుమారు ఎనిమిది అడుగులున్న కొండ చిలువ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం తొక్కేయడంతో మృతి చెందింది. రోడ్డు పక్కన కొండ చిలువ కళేబరం ఉన్నట్లు షికారీ కాలనీవాసులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ సిబ్బంది సంఘటన స్థలం చేరుకుని పంచానామా నిర్వహించి.. ఖననం చేశారు.

ఐపీ కేసుపై సీఐడీ విచారణ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీఐడీ డీఎస్పీ రసూల్

పెనుమూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కిందట పెనుమూరులో ఐపీ పెట్టిన పాండురంగయ్యశెట్టి కేసులో సీఐడీ అధికారులు విచారణ చేపట్టారు. సుమారు 900 మంది బాధితులు ఉండగా అధికారులకు కేవలం 120 మంది మాత్రమే ఫిర్యాదులు చేశారని.. మిగిలినవారు ఏమయ్యారని సీఐడీ డీఎస్పీ రసూల్ శనివారం ఆరా తీశారు. ఫిర్యాదుదారులను పెనుమూరు పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి.. వివరాలను రికార్డు చేశారు. పాండురంగయ్య శెట్టి కోర్టుకు సమర్పించిన వ్యక్తులు చాలామంది ముందుకు రావడం లేదని ఆయన చెప్పారు. డబ్బులు ఇచ్చిన వారు వివరాలు తెలియజేయకుంటే భవిష్యత్తులో ఇబ్బంది పడాల్సివస్తుందని డీఎస్పీ అన్నారు.

టీచర్లు డిజిటల్ వనరులను వినియోగించుకోవాలి

డైట్ ప్రిన్సిపాల్



సమావేశంలో ప్రసంగిస్తున్న శేఖర్

వెదురుకుప్పం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా టీచర్లు డిజిటల్ వనరులను వినియోగించుకుని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలని కార్వేటినగరంలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ సూచించారు. శనివారం తరగతి గది బోధనలో డిజిటల్ వనరుల వినియోగం అన్న అంశంపై ఉమ్మడి జిల్లాకు చెందిన 100 మంది ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని డైట్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. కృత్రిమ మేధ వంటి నూతన సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని చెప్పారు. శిక్షణ సంచాలకుడు, డైట్ లెక్చరర్ బి.చెంగల్‌రాజు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆసక్తిదాయకంగా బోధించాలని చెప్పారు. రిసోర్స్ పర్సన్లుగా పి.నీలకంఠయ్య, మనోహర్, కల్పన, శశిరేఖ వ్యవహరించారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను, స్కూల్ అసిస్టెంట్లను వేర్వేరు గ్రూపులుగా చేసి శిక్షణ ఇచ్చారు.

సమర్థ నాయకుల ఎన్నికలో ఓటుదే కీలక పాత్ర

జిల్లా జడ్జి భీమారావు



గాంధీ విగ్రహ కూడలిలో విద్యార్థుల మానవహారం



సీనియర్ సిటిజన్ పార్థసారథిని సన్మానిస్తున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు సెంట్రల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతులైన నాయకుల్ని ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా జడ్జి భీమారావు అన్నారు. చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో జేసీ విద్యాధరి అధ్యక్షతన 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఓటు విలువ భవిష్యత్ తరానికి తెలియజేసేలా విద్యార్థులతో జేసీ.. ఆన్‌స్టేజ్ ముఖాముఖి నిర్వహించారు. ఓటు నమోదు నుంచి ఓటువేసే వరకు చేపట్టే ప్రక్రియపై విద్యార్థులు, యువతతో చెప్పించే వినూత్న ప్రయత్నం ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువ వెలకట్టలేనిదని చెప్పారు.డీఆర్వో మోహన్ కుమార్,జిల్లా అటవీశాఖ అధికారి భరణి ,అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, మాట్లాడుతూ రోజూ సమాజంలో జరిగే పరిస్థితులను గమనిస్తూ మంచి నాయకుల్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు.అనంతరం యువతతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు పార్థసారథి నాయుడు, ఎన్.కేశవులు, ఆర్.నటరాజ్, శారద, ఖాదర్ బాషా, ముత్తుకుమరన్‌లను జిల్లా ఉన్నతాధికారులు సన్మానించారు. యువ ఓటర్లు అఫ్రీన్, ఆవణి, గుణవి, దుర్గా ప్రశాంతి, కుమరన్, శ్యాం, విఘ్నేష్, దినేష్, గోపి, హేమంత్ తదితరులకు ఎపిక్ కార్డులు అందజేశారు.ఓటరు దినోత్సవ ప్రాముఖ్యతపై పాఠశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన యామిని, మరియా, బిందుశ్రీ.. వక్తృత్వ పోటీల్లో అభినయ, విద్యశ్రీ, శ్రీరాకేష్.. క్విజ్ పోటీల్లో చరణ్‌తేజ్, మోక్షిత్‌కుమార్, బాలాజీ.. పాటల పోటీల్లో బ్లెస్సీ, ప్రణీత్, లీల తదితరులకు బహుమతులు అందించారు. జూనియర్ కళాశాల స్థాయి వక్తృత్వ పోటీల్లో ఫర్హాన్ నబీల్, రెహానా, భవాని.. క్విజ్‌లో సంపత్, హరీష్, దివ్య.. పెయింటింగ్‌లో మహాలక్ష్మి, శివకుమార్, ఉమ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. డిగ్రీ కళాశాల స్థాయి డ్రాయింగ్ పోటీల్లో దివ్య, అనూష, వైష్ణవి.. గ్రూప్ డిస్కషన్స్‌లో వరలక్ష్మి, షరీఫ్, ఉన్నిసా.. వక్తృత్వ పోటీల్లో కోకిల, చంద్రన, మేఘల.. క్విజ్ పోటీల్లో స్వాతి, వరలక్ష్మి, చందనలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ముఖ్య అతిథులు, జిల్లా ఉన్నతాధికారులు బహుమతులు ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న మానవహారం

ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తొలుత జేసీ విద్యాధరి ఆధ్వర్యంలో శనివారం గాంధీ విగ్రహ కూడలిలో విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ, మానవహారం ఆకట్టుకుంది. ర్యాలీని అసిస్టెంట్ కలెక్టర్, డీఎఫ్‌వో, డీఆర్వోతో కలిసి ఆమె ప్రారంభించారు. ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా నాగయ్య కళాక్షేత్రం వరకు ఈ ర్యాలీ సాగింది.ఏఎస్పీ రాజశేఖర రాజు, బాస్కెట్ బాల్ జాతీయ క్రీడాకారుడు నాగరాజు, ఆర్డీవో శ్రీనివాసులు, నగర కమిషనర్ నరసింహ ప్రసాద్, తహసీల్దారు కళావతి తదితరులు పాల్గొన్నారు.





ఎపిక్ కార్డుతో యువ ఓటర్లు - పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న జేసీ విద్యాధరి

డీకే ఇంట్లో చోరీపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దివంగత పారిశ్రామికవేత్త, టీటీడీ మాజీ ఛైర్మన్ డీకే ఆదికేశవులుకు సంబంధించి బెంగళూరులోని ఇంట్లో జరిగిన చోరీపై శనివారం ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ జయరామయ్య తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరులోని ఆదికేశవులు ఇంట్లో జీడీనెల్లూరుకు చెందిన కొంతమంది వ్యక్తులు పనులు చేస్తున్నారు. వారం కిందట తమ ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని, ఈ పనిచేసింది జీడీనెల్లూరుకు చెందినవారని ఆదికేశవులు కుటుంబీకులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ కేసును పరిశీలించాలని ఆయన ఒకటో పట్టణ పోలీసులకు సూచించారు. ఈ నేపథ్యంలో శనివారం ఆదికేశవులు కంపెనీకి చెందిన మేనేజర్ మునిరాజ్ ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.30-35లక్షల విలువైన బంగారుపూత పూసిన డైమండ్ ఆభరణాల దొంగతనం జరిగినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానితులుగా ఉన్న వ్యక్తులకు సంబంధించిన సీసీ ఫుటేజీలను కూడా అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపండి

ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఎంపీ ప్రసాదరావు సూచన


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతో వాహనాలు నడపాలని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సూచించారు. శనివారం గంగనపల్లె క్యాంఫర్డ్ పాఠశాలలో జరిగిన 36వ జాతీయ భద్రతా మాసోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రయాణికుల భద్రతతోపాటు తమ కుటుంబీకుల సంక్షేమం కూడా గుర్తు పెట్టుకోవాలని చెప్పారు. డీటీసీ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. వాహనాల కండీషన్ ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. నగర ట్రాఫిక్‌సీఐ నిత్యబాబు మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరారు. ఎంవీఐలు రాజేశ్వరరావు, నర్సింహులు పాల్గొన్నారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం


వైద్య సిబ్బంది చేతిలో పుట్టిన బిడ్డ

నగరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిండ్ర మండల పరిధిలోని కొప్పేడు గ్రామానికి చెందిన గర్భిణి జ్యోతిక (23)కు పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108 వాహనంలో వైద్యశాలకు తీసుకెళుతున్నారు. అయితే మార్గమధ్యంలో 108 వాహనంలోనే ఆమె ప్రసవించింది. అనంతరం సిబ్బంది ఆమెను నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు.

దారి సమస్యకు పరిష్కారం

బంగారుపాళ్యం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా వివాదాల్లో ఉన్న దారి సమస్యను తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి.. పరిష్కరించారు. తంబుగానిపల్లెకు చెందిన రైతు బాబు మండడి తన పొలానికి దారిలేక తీవ్ర ఇబ్బంది పడేవాడు. దీనిపై ఆయన ప్రతి సోమవారం కలక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో కలెక్టరుకు అర్జీ అందజేశాడు. కలెక్టరు ఆదేశాలతో తహసీల్దార్ పరిశీలించి.. సర్వే చేపట్టి దారిసమస్యకు పరిష్కారం చూపారు. సర్వేయర్ లావణ్య, వీఆర్వో సురేంద్ర పాల్గొన్నారు.


దారి సమస్యను పరిష్కరిస్తున్న తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్


కార్వేటినగరంలో స్తంభించిన ట్రాఫిక్

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో?

వెదురుకుప్పం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వాహనదారులకు నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారిలోని కార్వేటినగరం పట్టణంలో రోడ్డుపైకి ఆక్రమణలు రావడంతోపాటు వాహనాల తాకిడి ఎక్కువ కావడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనికితోడు చెరకు క్రషింగ్‌కు వెళ్లే ట్రాక్టర్ల వల్ల కూడా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఇకనైనా సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

నిరుపేదల కోసమే ఈటీపీ నిర్మాణం : భానుప్రకాష్


ఎమ్మెల్యేకు సమస్యను తెలియజేస్తున్న డైయింగ్ యూనిట్ల యజమానులు

నగరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలో మాన్యువల్ డైయింగ్ యూనిట్లు నడిపేవారు నిరుపేదలని.. వారికోసమే ఈటీపీ (రంగు నీటిని శుద్ధి చేసే ప్లాంటు)ను నిర్మించినట్లు ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. మాన్యువల్, మిషనరీ డైయింగ్ యూనిట్లకు చెందిన యజమానులు శనివారం ఎమ్మెల్యేని కలిసి తమ సమస్యను తెలిపారు. ఆయన స్పందిస్తూ.. మిషనరీ డైయింగ్ యూనిట్లకు చెందినవారు సొంతంగా ఈటీపీ నిర్మించుకోగలరని చెప్పారు. అందువల్ల గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన ఈటీపీని మాన్యువల్ యూనిట్ల వారే వాడుకోవాలని సూచించారు. దీనికి మిగిలినవారు సహకరించాలని చెప్పారు.

ముడిపల్లె సమీపంలో ఇసుక డంప్ సీజ్


ఇసుక డంప్‌ను సీజ్ చేసిన అధికారులు

నగరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని ముడిపల్లెకి వెళ్లే మార్గంలో హౌసింగ్‌కాలనీ వద్ద ఓ ఇసుక డంప్‌ను శనివారం సీఐ మహేశ్వర్ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. కొందరు కుశస్థలీ నది నుంచి ఇసుకను తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేసి.. రాత్రివేళలో తమిళనాడుకు తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని సీఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా వెనుక ఎవరున్నారో విచారించి, అరెస్టు చేస్తామని చెప్పారు. ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంబేడ్కర్ ఆశయాలను గౌరవించాలి: బీజేపీ


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చిత్తూరు సెంట్రల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపుతో యువమోర్చా ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్‌లో భాగంగా శనివారం స్థానిక గాంధీ విగ్రహం నుంచి దర్గా సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు గాంధీ, భాస్కర్, భాను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: తెల్లగుండ్లపల్లెలో అంబేడ్కర్ చిత్ర పటానికి, ఆళ్లమడుగులోనిఆయన విగ్రహానికి బీజేపీ నేతలు పుష్పాంజలి సమర్పించారు. ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, మునికృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు న్యాయం చేసిన చంద్రబాబు


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన నేతలు

చిత్తూరు సెంట్రల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈడిగ గౌడ మహాజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మద్యం దుకాణాల్లో 10 శాతం తమకు కేటాయించడం హర్షణీయమని చెప్పారు. కల్లు గీత కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రబాబు, నాయకులు దొరబాబు, వెంకటేశులు, ధనంజయ, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై కేసు నమోదు

సోమల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జనసేన కార్యకర్త మునీర్ సాహెబ్‌పై దాడికి పాల్పడిన సంఘటనతో పలువురు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు చౌడేపల్లె సీఐ రాంభూపాల్ తెలిపారు. కందూరుకు చెందిన జనసేన కార్యకర్త మునీర్ సాహెబ్‌ను గురువారం రాత్రి టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమల మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, శ్రీనివాసులు, రమేశ్, బాల నాయుడు, సత్యంనాయుడు, ధర్మనాయుడు, అర్జున్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బిడ్డలు చూడకుంటే ఆస్తిని తిరిగి తీసుకోవచ్చు

వృద్ధులైన తల్లిదండ్రులకు డీఎల్ఎస్ఏ కార్యదర్శి భారతి సూచన


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి భారతి

చిత్తూరు అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సంరక్షణను బిడ్డలు చూడకపోతే వారికి రాసిచ్చిన ఆస్తిని తిరిగి తీసుకోవచ్చని డీఎల్ఎస్ఏ కార్యదర్శి భారతి తెలిపారు. శనివారం తపోవనంలో జరిగిన వృద్ధుల దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. వృద్ధులయ్యాక తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆస్తిని రాయించుకున్నాక వారిని అనాథ ఆశ్రమాల్లో వదిలేస్తున్నారన్నారు. ఎవరైనా పిల్లలకు రాసిచ్చిన ఆస్తిని తిరిగి తీసుకోవాలంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. వృద్ధుల సమస్యలపై కోర్టులో ఉచితంగా వాదిస్తామన్నారు. వికలాంగుల శాఖ ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వృద్ధులకు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భారత రాజ్యాంగం తెలుగు అనువాద పుస్తకావిష్కరణ



నగరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం తెలుగు అనువాద పుస్తకాన్ని నగరిలో శనివారం ఆవిష్కరించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి గోవిందస్వామి, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌లు ఈ పుస్తకాన్ని తెలుగులో అనువదించిన వరుణ్ కుమార్‌తో కలిసి పుస్తకావిష్కరణలో పాల్గొన్నారు. పుణ్యమూర్తి, కోదండరామ్, భాగ్యలక్ష్మి, వేలాయుధం, విజయ్‌చందర్, మెయిల్‌స్వామి,సెల్వం పలువురు అంబేడ్కర్ సంఘం సభ్యులు హాజరయ్యారు.

కాణిపాకంలో కళా నివేదన

ప్రతి శని, ఆదివారాల్లో నిర్వహిస్తాం: ఈవో


నృత్యం చేస్తున్న కళాకారులు

ఐరాల(కాణిపాకం), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఇకపై ప్రతి శని, ఆదివారాల్లో కళా నివేదనను నిర్వహించనున్నట్లు వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఇందులో భాగంగా శనివారం బెంగళూరుకు చెందిన వైష్ణవి కళా బృందం కళాకారులు ఆలయ పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన వేదికపై కూచిపూడి, భరతనాట్యం చేశారు. ఈవో మాట్లాడుతూ మన సంస్కృతిని కాపాడుకోవడానికి దేవదాయశాఖ తరపున ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ కేంద్రం తెరిస్తే ఒట్టు


ఎంఎంవిలాసం వద్ద ఉన్న ఉపయోగంలో లేని చెత్త సేకరణ కేంద్రం

వెదురుకుప్పం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఎంఎం విలాసంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం తెరిస్తే ఒట్టు అన్న చందంగా తయారైంది. దీనికి గ్రామ పంచాయతీ ఉద్యోగులు, పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా దీన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న పశు ఆరోగ్య వైద్య శిబిరాలు

శ్రీరంగరాజపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. శనివారం మండలంలోని పిళ్లారికుప్పంలో జరిగిన శిబిరంలో పశువైద్యాధికారి శ్రీవిద్య, సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లె: మోదలపల్లెలో జరిగిన శిబిరాన్ని డీడీ హరీఫ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జయమోహన్, గోపాల మిత్ర తులసి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: పేటఅగ్రహారంలో జరిగిన శిబిరంలో పశువైద్యాధికారి డాక్టర్ దీపాని, శాంతకుమార్‌తోపాటు టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి: కాంగ్రెస్


కలెక్టరేట్ వద్ద ప్లేట్లను కొడుతూ నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

చిత్తూరు అర్బన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి అభ్యర్థులు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. హామీలను నిలబెట్టుకోవాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ వద్ద ప్లేట్లను కొట్టి మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. నేతలు ఉమేష్, రమేష్‌బాబు, పరదేశి, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడులు


మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్ మధుసూదనరెడ్డి

వి.కోట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మామిడిలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్ మధుసూదనరెడ్డి అన్నారు. శనివారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో వి.కోటలో మామిడి రైతులకు పూతకాలంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ సంధ్యారాణి పూత, మొగ్గదశలో ఆశించే ప్రధాన చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. తెల్ల పూత దశలో ఎలాంటి మందులు పిచికారీ చేయరాదన్నారు. నిమ్మకాయ సైజ్‌లో మామిడికాయలు ఉన్నప్పుడు కాయలకు కవర్లు కట్టడంతో నాణ్యమైన మంచి దిగుబడులు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా రైతులకు కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మ రామచంద్రనాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, రాంబాబు, హెచ్‌వో లక్ష్మీప్రసూన, రైతులు, రూతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా కుక్కలపల్లె పాఠశాల


పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు

యాదమరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కుక్కలపల్లె ఎంపీపీ పాఠశాల ఆవరణ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అపరిశుభ్రంగా తయారైంది. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులు ఉన్నారు. పిచ్చిమొక్కలు ఎక్కువవడంతో పాములకు ఆవాసంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే శుభ్రం చేయాలని కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

మొగిలీశ్వరుడి హుండీ ఆదాయం రూ.3.59 లక్షలు

బంగారుపాళ్యం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కామాక్షి సమేత మొగిలీశ్వరుడికి హుండీ ఆదాయం రూ.3,59,183 వచ్చినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్, ఈవో మునిరాజ తెలిపారు. శనివారం చిత్తూరు డివిజన్ దేవదాయశాఖాధికారి సుమనప్రియ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. నాలుగు నెలలకు గాను హుండీ ద్వారా రూ.302061, అన్నదానంకు రూ.57,122 వచ్చినట్లు తెలిపారు.

నేడు గంగాధర నెల్లూరుకు ప్రభుత్వ విప్ థామస్ రాక

గంగాధరనెల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులో ఆదివారం ప్రభుత్వ విప్ వి.ఎం.థామస్ పర్యటిస్తారని ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, ఎంఈవో ఆంజినేయులుశెట్టి తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో, తొమ్మిది గంటలకు హైస్కూల్లో జరిగే గణతంత్ర దినోత్సవంలో పాల్గొని, జాతీయ జెండాను ఎగురవేస్తారు. అనంతరం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో తన కార్యాలయాన్ని ఉదయం 10గంటలకు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30గంటలకు గంగాధరనెల్లూరు దళితవాడలో టీడీపీ నేత వెంకటేష్ కర్మక్రియల్లో పాల్గొంటారు.

నివాళి

నగరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ విశ్రాంత శానిటరీ ఇన్‌స్పెక్టర్ భూపాల్ శుక్రవారం మృతి చెందారు. దీంతో మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి, నివాళి అర్పించారు. వీరిలో కమిషనర్ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, సిబ్బంది ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

విజయపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విజయపురంలో శనివారం పరమేశమంగళం వద్ద నెలకొల్పిన అన్నాగౌరీ ఆస్పత్రి బృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు మహేశ్వరి, నరేష్, లోకేష్, నాగేశ్వరరావు, సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

వెదురుకుప్పం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అధికారి సురేష్ కుమార్ ద్వారా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. అన్నదాతలుగా కార్వేటినగరానికి చెందిన సత్యమ్మ, లలిత కుటుంబీకులు వ్యవహరించారు.

క్రైం కార్నర్

వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం


నవీన్ (ఫైల్ ఫొటో)

పూతలపట్టు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. బిడారిమిట్ట దళితవాడకు చెందిన నవీన్ (28) శుక్రవారం రాత్రి రంగంపేట క్రాస్‌రోడ్డు సమీపాన ఉన్న ఓ హోటల్ వద్దకు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తిరుపతివాసికి తీవ్రగాయాలు

నగరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తిరుపతికి చెందిన సాయికుమార్(38)కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సాయికుమార్ శనివారం తిరుపతి నుంచి ద్విచక్ర వాహనంలో నగరికి వస్తున్నాడు. నగరి మండల పరిధిలోని రామాపురం వద్దకొచ్చేసరికి చెన్నై నుంచి తిరుమల వెళుతున్న కారును ఢీకొనడంతో గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. తర్వాత తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

వాడవాడలా ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం వాడవాడలా నిర్వహించారు. ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వక్తలు తెలియజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.


నగరిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నగరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరిలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో భవానీశంకర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సీఐ మహేశ్వర్, రెవెన్యూ సిబ్బంది, పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: పుల్లూరు రోడ్డులో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథం పిళ్లై, ఎస్ఐ సుమన్, ఎంఈవో సబర్మతి, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లె: మండలకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రెడ్డిబాబు, డీటీ వెంకటరమణ, ఏపీవో రవి, రెవెన్యూ సిబ్బంది, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐరాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌కుమార్, ఆత్మ మాజీ చైర్మన్ అయిరాల రాజేష్‌రెడ్డి, మాజీఎంపీటీసీ దయానందమండడి,సాదిక్‌బాషా పాల్గొన్నారు.

పాలసముద్రం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత, ఆర్ఐ దేవి, సర్వేయర్ గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ గుర్రప్ప, ఈవోఆర్డీ శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదమరి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, డీటీ జయంతి, హెచ్‌ఎం గిరిరాజా, అమర్‌నాథ్ నాయుడు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంఈవో నాగేశ్వరరావు, సీఐ కత్తి శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమూరు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రుద్రయ్యనాయుడు, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, డీటీ వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎన్నికల డీటీ మోహన్‌రాజ, ఎంఈవో ఆంజినేయులుశెట్టి, ఆర్ఐ ఏకాంబరం, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు హాజరయ్యారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం ఆచారి, విద్యార్థులు పాల్గొన్నారు. బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి తహసీల్దార్ నాగరాజు హాజరయ్యారు.

నింద్ర: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, ఎంఈవో శ్రీధర్‌రాజు, వీఆర్వో రుక్మిణి, విద్యార్థులు పాల్గొన్నారు.